# నెలవులు

## టి.యస్.ఎ. కృష్ణమూర్తి

"బస్తీ కెళ్ళి బ్రతకాలని నిశ్చయించుకునేశాను మామా!" అన్నాను.

రంగప్పమామ చూపులలో చాల ఆశ్చర్యం కన్పించినా "నీ ఇట్టంరా!" అన్నాడు నవ్వి. ఆయనలోని గొప్పదనం అదే ఎవరినీ, ఎందుకూ ఆటంక పరచడు

"ఒకపూట మాత్రం తిండి పెట్టి రోజుకి నాలుగు రూపాయలు కూలి ఇస్తారు మన వూర్లో. అదే బస్తీలో అయితే రోజుకి పదిహేను రూపాయలు సునాయాసంగా సంపాదించుకోవచ్చు!" అన్నాను

"ఖరుసు కూడా ఉంటుందనుకుంటాన్రా అబ్బి!" అన్నాడు ఆయన.

"ఎంతలా ఖర్చు చేసినా రోజుకి కనీసం ఓ అయిదు రూపాయలు మిగిల్చుకోవచ్చు మామా! ఇక్కడ పని వున్న రోజు ఉంటుంది. లేనిరోజులలో మనం పడే బాధలో? అందుకే బస్తీకెళ్ళి ఏదో ఒక పని వెతుక్కుందామని అనుకుంటున్నాను అమ్మ కష్టం, సుఖం నీవే కనిపెట్టుకు నుండాలి. ఉత్తరాలు నీకే వ్రాస్తాను డబ్బు కూడా నీ పేరిటే పంపుతాను అమ్మకు అందజేస్తూండు!"

"నీ ఇట్టంరా!"

"రేపు ఉదయాన్నే బయల్దేరి వెళ్ళి పాలకొండ స్టేషన్లో రైలెక్కి వెళ్తాను"

"మంచిదిరా! చేమంగా ఎళ్ళిరా!"

'క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగిరా!' అనలేదు రంగప్పమామ. అయితే నేను ఆ విషయాన్ని అంతగా పట్టించుకోలేదు

ఇతరుల పనుల మీద అనేక పర్యాయాలు బస్తీకి వెళ్ళి వచ్చిన వాడ్నే బస్తీలో చాల ప్రదేశాలు తెలుసు ఒకరిద్దరు ముఖ పరిచయస్తులు కూడా వున్నారు ఏ పని దొరికినా నా పల్లెలో కన్నా నాలుగు రూపాయలు ఎక్కువగా సంపాదిచుకోగలననే నమ్మకంతో బయల్దేరాను.

* * * * *

బస్తీ.... ఇక్కడ నివసించే మనుషులు చిత్రమైన వాళ్ళు! సాటి మానవుడు నడి రోడ్డుమీద దిక్కులేని చావు చచ్చిపోతున్నా పట్టించుకునేవారు అరుదు ఇక్కడ. ఇక్కడి మనుషులకు ఎదుటి వాళ్ళనుగూర్చి ఆలోచించే ఓపికా, తీరికా సామాన్యంగా వుండవు. ఎక్కువభాగం మనుషులు తమ పనులలో తాముంటారు తప్ప ఎదుటివారి బాధలవైపు కన్నెత్తి చూడరు పన్నెత్తి పలకరించరు

బస్తీలో నాలుగు రోజులు చెడ తిరిగిన తరువాత, పల్లెనుండి తెచ్చుకున్న డబ్బు పూర్తిగా ఖాళీ అయిపోబోతూవుండగా నాకు ఒక చక్కని పని దొరికింది

రిక్షాత్రొక్కడం!

బస్తీలో నాకు తెలిసిన రామరాజుగారనే పెద్ద మనిషి నన్ను నమ్మి నాకు ఒక రిక్షా అద్దెకు ఇప్పించాడు రిక్షాకి రోజుకి ఐదు రూపాయలు అద్దె చెల్లించాలి. రాత్రింపవళ్ళు రిక్షా నావద్దే ఉంచుకోవాలనుకుంటే రోజుకి ఏడు రూపాయలు చెల్లించాలి

ఆనందంగా రిక్షాత్రొక్కడం మొదలుపెట్టాను

మొదటి రెండ్రోజులూ రిక్షాఅద్దె చెల్లించగా నాకు మిగిలిన డబ్బులు నా భోజనానికే సరిపోలేదు ఎందుకంటే రిక్షా త్రొక్కడం క్రొత్తగా నేర్చుకుంటున్నవాడ్ని కాబట్టి ఎక్కువ బాడుగలు త్రొక్కలేకపోయాను

మూడవ రోజు నుండి ఎక్కువ బాడుగలే త్రొక్కసాగాను అయినా నేను సంపాదించిన డబ్బులు నా కడుపుకే సరిగ్గా సరిపోవడంలేదు రిక్షా త్రొక్కడం అంటే ఏమిటో అనుకున్నాను కానీ రిక్షా త్రొక్కడంవల్ల ఆకలి ఆకలి విపరీతమైన ఆకలి ఎన్నిసార్లు తిన్నా, ఎంత తిన్నా భస్మం అయిపోతోంది

చివరికి నేను గ్రహించిన దేమిటంటే హొటల్లలో నేను అన్నం తింటూ రిక్షాత్రొక్కాలంటే మా అమ్మకు పంపడాన్కి నెలకి పది రూపాయలు కూడా మిగల్చలేను. అందుకే నంజప్ప పూటకూళ్ళ ఇల్లు కనుక్కుని అక్కడ సంగటి ముద్దలు తినడం మొదలుపెట్టాను

నాకు మూడు రకాలుగా ఆనందం లభించింది మొదటిది... సంగటి తినడంవల్ల నేను కొంత డబ్బు మిగిల్చగలుగుతున్నాను. రెండవది ...నాకు సంగటి అంటే ఇష్టం. చివరిది రిక్షా త్రొక్కడం వల్ల కలిగే అధిక క్షుద్బాదను నివారించ గలుగుతోంది సంగటి

నా కాళ్ళలో, నా జబ్బల్లో బలం వుంది. నా రక్తాన్ని - చమటగా మార్చి రిక్షా త్రొక్కి డబ్బు సంపాదిస్తున్నాను కానీ. .

* * * *

ఒక రోజు సంఘం టాకీసు వద్ద ఓ లావుపాటి పోలీసు నా రిక్షాలో ఎక్కాడు త్రీ టవున్ స్టేషన్ వరకూ రెండున్నర మైళ్ళు ఎండలో పడి రిక్షా త్రొక్కి తీసుకెళ్తే డబ్బు లివ్వకుండా వెల్తున్నాడు. అడిగితే.. "మక్కెలిరగదన్ని లోపల తోస్తాను వెధవనా కొడకా!" అని తిట్టి మరి పోయాడు.

ఉసూరుమంటూ నిలబడి పోయిన నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి మా ఊరి రెడ్డి కూడా నాలాంటి వాళ్ళను అప్పుడప్పుడు తన పొలంలో పని చెయ్యడాన్కి తీసుకెళ్ళి పని చేయించుకుని డబ్బు లివ్వడు. కానీ తిట్టడం మాత్రం చెయ్యడు. కడుపు నిండా తిండిపెట్టిస్తాడు కూడా.

మా ఊరి రెడ్డే నయం అన్పించింది.

స్టేషను బయట ఎండలో పసి పిల్లల్ని ఇద్దర్ని పొదివి పట్టుకుని ఏడుస్తూ కూర్చుని ఉంది ఓ స్త్రీ. ఆమె భర్త ఏదయినా ఘణకార్యం చేసి లోపల ఆదిత్యం స్వీకరిస్తున్నాడేమో? ఎండలో కందిపోతున్న ఆ పసి కందమ్మలనూ, దుఃఖంతో తల్లడిల్లుతున్న ఆమెనూ చూశాక ఆ పోలీసు డబ్బులివ్వనందుకు కలిగిన బాధ తగ్గిపోయింది నాలో. వాళ్ళకేసి జాలిగా చూసి అక్కడ్నుండి భారంగా బయల్దేరాను

ఇంకో రోజు రాత్రి పండ్రెండు గంటల దాకా బాడుగల కోసం కాచుకుని చిన్న ఎలక్ట్రిసిటీ ఆఫీసు ప్రక్కగా రిక్షా ఆపుకుని రిక్షాలోనే నిద్రపోయాను అక్కడ రిక్షాలు ఆపరాదట ఆ విషయం నాకు తెలియదు తెల్లగా తెల్లవారక మునుపే రిక్షా చక్రాల వాల్వ్‌ట్యూబులు అన్నీ తీసి కాలువలో పారవేశాడు ఆ ఆఫీసు తాలూకు ఉద్యోగి ఎవరో.

వరుసగా చక్రాలలో గాలి పోయిన శబ్దానికి నిద్ర లేచిన నేను "ఏమిటి ఈ అన్యాయం?" అని అడిగితే కొట్టడానికేవచ్చాడు

నా కడుపు కాలిపోయింది మా ఊర్లోనూ కర్కోటకు లున్నారు కానీ కడుపులమీద కొట్టే వాళ్ళు మాత్రం లేరు నెత్తినోరూ బాదుకోబోయి ఎదురుగా కన్పించిన దృశ్యం చూసి ఆగిపొయ్యాను

రోడ్డుకు అవతల వైపు వున్న హొటలు వరండాలో రాత్రెప్పుడో వచ్చి చలికి ముడుచుకుపోయి పడుకున్న అభాగ్యుల మీద బక్కెట్లతో నీళ్ళు చల్లుతున్నాడు హొటలు తాలూకు మనిషి.

నన్ను గూర్చి బాధపడకుండా ఆ అభాగ్యులన్ను గూర్చి చింతిస్తూ రిక్షాను లాక్కుని బయల్దేరాను.

ఒక్క సైకిలు షాపూ తెరవ లేదు ఎక్కడా అప్పటికి.

బారెడు ప్రొద్దెక్కాక తెరచిన ఓ సైకిలు షాపులో నాలుగు రూపాయలు ఇచ్చి వాల్వ్‌ట్యూబులు వేయించుకుని గాలి కొట్టుకుని బయల్దేరితే.... ఆ రోజంతా కటకటే! రిక్షా అద్దె డబ్బులు సంపాదించుకోవడమే గగనమై పోయింది.

రిక్షా త్రొక్కడానికి లైసెన్సుండాలని తెలియదు

నాకు. ఎవరూ చెప్పనూ లేదు. ఓ రోజు ఓ పోలీసు లారితో బాది నా వద్ద పది రూపాయలు గుంజుకు పోయాడు. నేను లైసెన్సు లేకుండా రిక్షా నడుపుతున్నందుకు లైసెన్సు తెచ్చుకోవడానికి వారం రోజుల కూలిపాటు పోయింది.

రిక్షాకి కూడా లైసెన్సుండాలని తెలీక పోవడంతో ఓ రోజు రిక్షాని మునిసిపాలిటీ వాళ్ళు పట్టుకు పోయారు. రిక్షాయజమానిని లైసెన్సు గూర్చి అడిగితే "నేను నీకు రిక్షా ఇచ్చినప్పుడు దానికి లైసెన్సు బిల్ల ఉంది ఫో!" అనేశాడు ఇహ చేసేది లేక పది రూపాయలు పెట్టి లైసెన్సు బిల్ల కొని రిక్షా తెచ్చుకోవాల్సి వచ్చింది.

ఆ మరునాడే రోడ్డు వారగా నిలబెట్టి వున్న నా రిక్షా రాంగ్‌సైడ్‌లో ఉందంటూ కేసు పెట్టాడు ట్రాఫిక్ పోలీసు. అకారణంగా ఐదు రూపాయలు అపరాధం క్రింద కట్టాల్సి వచ్చింది కోర్టులో.

ఈ బాధలన్నీ తెముల్చుకుని రెండు రూపాయలు సంపాదించే ప్రయత్నంలో నేనుండగా నా సైకిలు రిక్షాకి ఫోర్కు విరిగి పోయింది. రిపేరి చేయించమంటే "విరగ్గొట్టింది నీవే కాబట్టి నీవే రిపేరి చేయించాలి" అంటాడు రిక్షాయజమాని

చివరికి నేను గ్రహించిన దేమిటంటే ఈ వెధవ రిక్షా త్రొక్కడం కన్నా సినిమా హాల్లో వేరుశనక్కాయలు అమ్ముకోవడం నయం! అని.

అందుకే రిక్షాకి ఓ నమస్కారం పెట్టి వదిలేసి రామరాజుగారి సహాయంతో ఓ హోటల్లో సప్లయిర్‌గా చేరాను.

"శ్రమ తక్కువ, తిండిని గూర్చిన సమస్య అసలుండదు, అమ్మకి పంపించడానికి, ఇంతో అంతో మిగిల్చుకోవడానికి ఇబ్బంది లేదు" అనుకుని ఆనందపడి పోయాను. కాని ..

★ ★ ★ ★

"కాఫీ చెప్పి ఎంతసేపయిందయ్యా?"

"దోశ ఇలా మాడి తగలడిందేమోయ్!"

"ఒరేయి త్వరగా తీసుకురారా పెసరట్!"

"నీళ్ళేవిరా బుజ్జితండ్రీ!"

ఇలాంటి మర్యాదలు అందుకుంటూ నా పని ప్రారంభించాను.

సహజంగా హొటల్ సప్లయర్లని చాలా అగౌరవంగా చూస్తారు మనుషులు. కొందరయితే మీదపడి కొట్టడానికి వచ్చినంత పని చేసేవాళ్ళు. 'వీడూ మనలాంటి మనిషే!' అనే సహృదయంతో ప్రవర్తించే వాళ్ళు తక్కువమంది

చాల ఓపికగా అన్నీ భరించసాగాను... కానీ... నాకు ఆ యోగం లేదు. నాన్న బ్రతికి ఉన్నప్పుడు ఎప్పుడో చదివిన వానాకాలపు చదువు ఆ సప్లయర్ పనికి చాలక పోవడంతో బిల్లులు వేయడంలో పొరపాట్లు చెయ్యసాగాను.

హోటల్‌కు వచ్చే వారి వద్ద డబ్బులు లంచంగా తీసుకుని బిల్లులు తక్కువ వేస్తున్నానని అనుమానించి మెడపట్టి మరీ గెంటేశాడు హోటలు యజమాని.

మా ఊరే నయం. తప్పు చేసిన వాడి మెడ మీద కూడా చెయ్యి వెయ్యరు ఎవరూ. అపరాధం వేస్తారంతే!

ఈ పర్యాయం రామరాజుగారి సహకారంతో ఓ సైకిలూ, ఓ పాల క్యానూ అద్దెకు తీసుకుని పాల వ్యాపారం ప్రారంభించాను రోజూ చీకటితో నే చుట్టుప్రక్కల వున్న పల్లెటూర్లకు వెళ్ళి పాడి పశువులున్న వారి వద్ద పాలుకొని తీసుకువచ్చి టీ దుకాణాలకు వెయ్యడం ప్రారంభించాను. నా తిండి తిప్పలు జరిగిపోయి రోజుకు పది రూపాయల రాబడి కన్పించింది. ఆనందమే కదా?! కానీ. ...

★ ★ ★ ★ ★


"ఏయ్! సైకిలు ఆపు!"

సైకిలు ఆపాను.

కాఖీ బట్టలలో వున్న ఆ యువకుడు నా దగ్గరగా వచ్చాడు.

"రోజూ ఈ త్రోవమ్మటే వస్తావు కదూ?"

"అవును!"




'రోజూ ఆ ఎదురింట్లో ఓ లీటరు పాలు వేసి వెళ్ళు!"

"అలాగే బాబూ! ....డబ్బులు ఏ రోజు కారోజు ఇస్తారా? వారానికి ఓ సారా?"

అతను పగలబడి నవ్వాడు.

"ఆ ఇల్లు ఎవరిదనుకుంటున్నావు?"

"ఎవరిది బాబూ?"

"హెల్తు ఆఫీసరు వారి ఇల్లు అది. రేపట్నుండి పాలు వెయ్యి. పాలు చిక్కగా వుండాలి. డబ్బులు గిబ్బులు అడగకు... జాగ్రత్త!"

"వెయ్యక పోతే బాబూ?"

"నీ పాలు డబ్బిచ్చి కొని బాటిల్లలో పోసి సీలు చేసి రాజధానికి శాంపిల్ పంపిస్తాము. రిజల్టు రాగానే కోర్టుకు లాక్కు వెళ్ళి కేసు పెడ్తాము ఆర్నెల్లకి తక్కువ కాకుండా జైలు శిక్ష పడుతుంది ఫెనాల్టీ కూడా ఓ అయిదు వందలుండ వచ్చు!"

ఆ మరుసటి రోజు నుండి ఒక లీటరు పాలు ఉచితంగా ఆ మేస్త్రీ చూపిన ఇంటిలో వేయసాగాను.

నాలుగు రోజులు గడిచాయి.

"ఒరేయి ఆ క్యానులో ఎన్ని లీటర్లున్నాయిరా పాలు?"

"పదహారు లీటర్లు బాబూ!"


"ఆరు లీటర్లు ఆ స్టీలు డ్రమ్ములో పోసి పోరా!"

క్రూరంగా వున్న ఆ పేట రౌడీని చూసి భయపడూ అరుంపావు లీటరు కొలచి స్టీలు డ్రమ్ములో పోశాను.

"బాబూ! డబ్బులు....."

"సవిటి కాలువలో తోసి బోడి కొట్టిస్తాను లం. ..! మా దాదా వాళ్ళ బంధువుల పెళ్ళికి కాసిన్ని పాలు

# ఈ 'వేమన' పద్యాలు




అడిగితే డబ్బు లడుగుతావూ? ప్రతిరోజూ ఇస్తావేం రా బాడూష్! పరిగెత్తు... ఇక్కడే వుంటే క్యాను లాక్కుని తన్ని తగలేస్తాను!"

అంటూ తిట్టి అటుగా వస్తున్న మరో అభాగ్యుడి పాల క్యాను ఆపవలసిందిగా పురమాయించాడు తన సహాయక రౌడీని.

మండే గుండెతో, కాలే కడుపుతో, రగిలే మనసుతో వనికే కాళ్ళతో అక్కడ్నుండి బయల్దేరాను. సైకిలు నెట్టుకుంటూ 'దరిద్రుడికి సముద్రుడు కూడా మోకాలిలోతే!' అన్పించింది.

## నెలవులు

మా ఊర్లో అయితే పాలను అమృతంలా భావిస్తారు. కరణంగార్లి ఇంట్లో వాళ్ళు గూడా పాలు ఉచితంగా తీసుకోరు ఎవరి వద్దా! కానీ ఈ జనారణ్యంలో......

అలాంటి అనుభవాలే మరో రెండుమూడు లభించిన తరువాత పాల వ్యాపారం మానేసి రామరాజుగారి చెప్పుల షాపు ప్రక్కగా ప్లాట్‌ఫారం మీద టీ దుకాణం పెట్టాను. కాలే కడుపుకు మండే గంజి అన్న చందంలా నాలుగు రూపాయల రాబడి కన్పించింది అందులో నూ కానీ

★ ★ ★ ★ ★

రోడ్డు మీది టీ దుకాణానికి మునిసిపల్ లైసెన్సు తెచ్చుకుని, ప్రొఫెషన్ టాక్సు, లేబర్ టాక్సు కట్టిన తరువాత కూడా పోలీసులకూ, రౌడీలకూ, హెల్త్ మేస్త్రీలకూ .. రోజుకి పాతిక మందికి తక్కువ కాకుండా ఉచితంగా టీ కాఫీలు ఇవ్వాల్సి వచ్చింది

ప్లాట్‌ఫారం దుకాణం కాబట్టి వర్షం పడే రోజులలో, ఊర్లో ఏవైనా మినిస్టర్ ప్రోగ్రాంలున్నప్పుడూ నా పని శూన్యం అయిపోయేది. పైగా టీ త్రాగి గ్లాసు జేబులో వేసుకుని వెళ్ళిపోగల చతురులనూ, డబ్బులివ్వకుండా జారుకో గల పెద్దమనుషులనూ కనిపెట్టి వుండడం కష్టంతో కూడుకున్న పని.

ఒక్కరోజు పాలు చెడిపోతే నాలుగు రోజుల ఆదాయం పోయినట్టే!

★ ★ ★ ★ ★

"టీ షాపు కూడా నాకు అచ్చిరాదు కానీ మరేదయినా దారి చూపించండ్" బాబయ్యా!" అన్నాను చివరికో నాడు

చాచి లెంపకాయ కొట్టారు రామరాజుగారు కళ్ళు తిరిగి కూలబడ్డాను ఆయన కాళ్ళ వద్దే!

చిన్నతనంలో వీధి బడిలో చదివిన ఓ పద్యం జ్ఞాపకానికి వచ్చింది

"కమలములు నీట బాసిన కమలాత్మని
రస్మిసోకి కమలిన్ భంగిన్,
తమ తమ నెలవులు తప్పిన తమ మిత్రులె
శత్రు.. .. . ."

"ఒరేయి నీలాంటి వాళ్ళు ఇలాంటి ఊర్లలో బ్రతకాలంటే దేశం చాల మారాలి. పైవాడు, క్రిందివాడు అదే తేడా లేకుండా మనిషి మనిషిగా బ్రతికే రోజులు రావాలి అలాంటి మార్పు ఇప్పట్లో రాదు, అలాంటి రోజులు కనుచూపు మేరలో లేవు కాబట్టి నీ వూరు వెళ్ళిపోయి నీ పాత బ్రతుకే బ్రతుకు నీకు అదే మంచిది!" అన్నాడు ఆయన.

"నిజం! అదే మంచిది!!" అనుకున్నాను మనసులో

ఆ మరునాడు తెల్లవారు ఝామున్నే నా చేతి సంచి భుజానికి తగిలించుకుని రైల్వే స్టేషను కేసి నడిచాను

★ ★ ★ ★ ★

"గంజో, అంబలో త్రాగి మన ఊర్లోనే బ్రతకాలని వచ్చేశాను మామా! ఇక భస్తీ ఛాయలకు కూడా వెళ్ళదలచుకోలేదు!" అన్నాను.

రంగప్ప మామ చూపులలో ఆశ్చర్యం కన్పించలేదు.

"శుభం! కలకాలం సుఖంగా బతుకు!" అన్నాడు.

చదువు సంధ్యలు లేనివాడయినా లోకం చూసినవాడు రంగప్ప మామ. నేను బస్తీకి వెళ్ళేప్పుడు "క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగిరా!" అని ఎందుకు ఆశీర్వదించలేదో అర్థం అయింది నాకు □